రచన - జనవరి 2004

# లగ్నబలం

"ఉన్నట్టుండి రమ్మని మీరు పంపిన కబురందీ రెక్కలు కట్టుకొని వచ్చి వాలాను. ఏమిటి విశేషం?" అని ప్రశ్నించాడు సిద్ధాంతి సీతారామశాస్త్రి.

"అమ్మాయి నచ్చిందని అబ్బాయి తండ్రి ఫోను చేశాడు. అబ్బాయేమో అమెరికాలో ఉన్న అదేదో ఇండోఅమెరికన్ బెంచ్ కంపెనీలో ఉద్యోగంలో వెంటనే జేరాలట. వచ్చే నెల ఇరవయ్యో తారీఖులోగా ఏదైనా మంచి ముహూర్తం చూసి చెప్పండి," అంది లక్ష్మీనర్సమ్మ సిద్ధాంతితో.

"అమ్మా, కేలండర్లు చూసీ, కంప్యూటర్లు ఉపయోగించీ ముహూర్తాలు పెట్టేవాడు కాదీ సీతారామశాస్త్రి! మా తాతముత్తాతల కాలం నుంచీ దేవతలతో పాటు మా ఇంట అర్చన చేయించుకొంటున్న సహస్రవర్ష పంచాంగం ఆధారంగా లగ్నం నిశ్చయిస్తాను! అబ్బాయి జాతకం, అమ్మాయి జాతకం ఇవ్వండి మరి." అన్నాడు సిద్ధాంతి.

"నచ్చని సంబంధానికి మనసు నొప్పించకుండా చెప్పే అందమైన వంక జాతకం! నచ్చిన సంబంధానికి జాతకాలెందుకు సిద్ధాంతిగారూ?వాళ్ళు జాతకాల మీద నమ్మకం లేదన్నారు" అన్నాడు లక్ష్మీనర్సమ్మ భర్త సుబ్బారావు.

"మీరన్నది ఒకర్నొకరు ఇష్టపడే వరకే కనక, అది మీ ఇష్టం! కనీసం ముహూర్తబలం బావుంటే జాతకాల్లోని అరిష్టాలు తొలగిపోతాయని జ్యోతిర్బ్రహ్మ సీతారామశాస్త్రిగారు చెబ్తూండేవారు," అన్నాడు సిద్ధాంతి.

"సీతారామశాస్త్రి అంటే మీరే కదా?! అయినా ఈ బిరుదు మీకే సన్మాన సభలో, ఏ సంఘం వారు ప్రదానం చేశారు?" సుబ్బారావు ప్రశ్నించాడు.

"ఆయన నేను కాదు, మా తాతగారు! బిరుదు నిచ్చింది కాటన్ దొరగారు! మీరనవసరంగా మాటల్తో కాలయాపన చేస్తున్నారు. శుభముహూర్త నిర్ణయం కూడా శుభసమయంలోనే గణించి చెప్పాలి. ఇంకో అరగంటలో దుర్ముహూర్తం వచ్చేస్తుంది. జాతకాలు త్వరగా పట్రండి" అన్నాడు సీతారామశాస్త్రి సుబ్బారావుని మందలిస్తూ.

"సిద్ధాంతిగారూ! వాస్తవానికి నేను అమ్మాయి జాతకచక్రం వేయించలేదు. ఇరవై నాలుగేళ్ళ క్రితం, ఆగష్టు పధ్నాలుగు రాత్రి వాళ్ళమ్మ కడుపులో మా అమ్మాయి తీరికూర్చుని అడ్డం తిరిగిపోవడంతో, అత్యవసర పరిస్థితిలో కత్తెర వేసి తీయించవలసి వచ్చింది. ఆపరేషన్ సమయానికి అశ్లేష నాలుగో పాదం నడుస్తోంది. అప్పటికింకా తిథి, వార నక్షత్రాలు చూసి సిజేరియన్ ఆపరేషన్ చేసే, లేదా చేయించే ఇంగిత జ్ఞానం డాక్టర్లకీ లేదు, తల్లిదండ్రులకీ లేదు! అందుకని మరో రెండు గంటలు ఆలశ్యంగా వేసి, మఖా నక్షత్రం అంటగట్టి, పుట్టిన తేదీని ఆగష్టు పదిహేనుగా నమోదు చేయించాను. మా దగ్గర జాతకాల మీద నమ్మకం లేదని నీరాలు పలికినా, అక్కడ జాతకచక్రం వేయించుకొని చూపించుకొనే ఉంటారు!" అన్నాడు సుబ్బారావు.

"ఆయనకీ వివరాలన్నీ చెప్పడం ఎందుకు?" లక్ష్మీనర్సమ్మ గదమాయించింది.

"వాది న్యాయవాదికి నిజం చెప్తేనే కాని కేసు బలంగా వాదించలేడు. ఇదీ అంతే అనుకోండి. మొగ పెళ్ళివారికి జనన వివరాలేమిచ్చామో అవే గణనలోకి తీసుకొని ముహూర్తం నిశ్చయించాలి. లేకపోతే మీ పరువు మాట దేముడెరిగినా, నా పరువు మట్టుకు గంగలో కలిసిపోతుంది! సరే, వాళ్ళు మీకిచ్చిన జాతకం ఉందా?" సిద్ధాంతి అడిగాడు.

"వాళ్ళూ మాలాగే జనన సమయమూ, పుట్టిన తేదీ యిచ్చి, 'మీకంత జాతకాల మీద నమ్మకముంటే చక్రం మీరే వేయించుకోండి' అన్నారు. అబ్బాయి పుట్టింది 1974లో, ఆగష్టు 15 ఉదయం ఆరు గంటలకి," అన్నాడు సుబ్బారావు.

"అబ్బాయి కూడా కత్తెర బిడ్డా లేక కానుపు బిడ్డా?" సిద్ధాంతి ప్రశ్నించాడు.

"ఏమో, కనుక్కోలేదు," అన్నాడు సుబ్బారావు.

సిద్ధాంతి అయిదు నిముషాలు కళ్ళు మూసుకొని, వేళ్ళు మడిచీ, విప్పీ, "ఆగష్టు 15 ఉదయం 8.45కి. ఇవ్వాళ జులై 31 సరిగ్గా పదిహేను రోజులుంది. త్వరపడండి. కొన్ని చిన్న చిన్న దోషాలున్నా, ఇరవై రోజుల్లోగా పెళ్ళి చెయ్యాలంటే ఉన్నవాటిలో ఇదే మంచిముహూర్తం," అంటూ లేచాడు.

గేటు వరకూ సిద్ధాంతిని సాగనంపే మిషతో బయటకు వెళ్ళిన సుబ్బారావు రోడ్డు మీద గోడ చాటున సిద్ధాంతిని ఆపి అన్నాడు – "మా అమ్మకి ఎనభై అయిదు. మా అత్తగారికి ఎనభై. ఇద్దరి ఆరోగ్యాలూ అంతంత మాత్రంగా ఉన్నాయి. అమ్మాయి పెళ్ళి అతికష్టం మీద కుదిరింది. ముహూర్తబలం గట్టిదేనంటారా?"

"నేను వాస్తవానికి మీ అమ్మాయి అసలు జనన సమయ వివరాల్నే గణనలోకి తీసుకొని ముహూర్తం పెట్టాను. మీరు చేసిన ఆ రెండు గంటల సవరణా, మార్చిన మఖా నక్షత్రమూ ముహూర్తానికేమీ ముప్పు తీసుకురావు. మీ ఆవిడగారి ముందే ఈ మాటంటే, ఆ నోటా ఈ నోటా కోట దాటుతుందని చెప్పలేదు. మీరూ మౌనంగా ఉండిపోండి."

"మరి అబ్బాయి జనన సమయం..." సుబ్బారావు నసుగుతూ అన్నాడు.

"వాళ్ళిచ్చిన వివరాలే నిజమనుకోవాలి, గత్యంతరం లేదు! అయినా మీరు కంగారు పడకండి. నేనింటికి వెళ్ళగానే లగ్నపత్రికని వ్రాసి, సహస్ర వర్ష పంచాంగం మధ్య పెట్టి, కళ్యాణ దేవతాకటాక్ష జపం చేసి మీకు పంపిస్తాను. అంతా మేలే జరుగుతుంది," అని సిద్ధాంతి స్కూటరెక్కి వెళ్ళిపోయాడు.

లోపలికి వచ్చిన భర్తని లక్ష్మీనర్సమ్మ ప్రశ్నించింది.

"ఏమిటీ, గేటు వరకూ వెళ్ళి గుసగుసలాడి వచ్చారు?"

సుబ్బారావు లక్ష్మీనర్సమ్మని ముందు ఆవరణలోకి తీసుకెళ్ళి నెమ్మదిగా అన్నాడు.

"నేనేమి గుసగుసలాడలేదు. ఆయనే నన్ను సంజ్ఞ చేసి బయటకు రమ్మన్నాడు. 'ఇంట్లో ఉన్న ముసలమ్మల భుజాల మీదుగా కళ్యాణవిఘ్నకిరణాలు ప్రసరిస్తున్నాయి! అందుచేత మీ శ్రీమతి చేత పెళ్ళిరోజు ముందువరకూ ప్రతినిత్యమూ, ముసలివాళ్ళిద్దరి పేరిటా మృత్యుంజయ

జపమంత్రం నూటెనిమిదిసార్లు పఠింపజేసి, ఒంటిపూట భోజనం చేయిస్తూ ఉపాసదీక్ష చేయించండి. పనిలో పని, కాబోయే వియ్యపురాలి పేరు కూడా కలపండి!' అని సలహా ఇచ్చాడు. ఆ పైన నీ యిష్టం!" అన్నాడు సుబ్బారావు చాలా సీరియస్‌గా.

"మన పెళ్లిలో మా పుట్టింటి వాళ్ళిచ్చిన వడ్డాణం యిప్పటికే వదులై పోయింది. ఈ పదిహేను రోజులూ ఉపవాసముంటే దాన్ని లాకర్లోనే ఉంచేయాలి కాని, ధరించడానికి వీలుండదు!" అంది లక్ష్మీనర్సమ్మ కాస్త బెంగగా.

"మీ పుట్టింటి వాళ్ళిచ్చిందని అందరికీ తెలియాలంటే దాన్ని నువ్వే ధరించాలని ఎక్కడా లేదు! అమ్మాయి నడుంకి తగిలించి అత్తారింటికి పంపు. మూడు తరాల స్త్రీలకది ఆభరణంగా ఉందని అందరికీ చెప్పుకుంటుంది" అన్నాడు తాపీగా.

"అలా చేస్తే మన పెద్దమ్మాయి పోడిచీ, కోడలు విషం పెట్టీ నన్ను చంపేస్తారు! నేను బ్రతికున్నంతకాలమూ అది నాకు వడ్డాణమే కాదు, రక్షక కవచం కూడా! సర్లేండి, దాన్నలా లాకర్‌లోనే పడిఉండనివ్వండి. అందరి కళ్ళా పడే అదృష్టం దానికి లేదు! అవునూ, ఈ ముసలాళ్ళిద్దర్నీ తీర్థయాత్రలకి పంపేస్తే?" అంది లక్ష్మీనర్సమ్మ తగ్గు స్వరంలో.

"ఎవరు తీసుకువెడ్తారు? నువ్వే తీసుకు వెళ్ళాలి. కన్యాదానం చెయ్యడానికి నేనెవర్నో అద్దెకు తెచ్చుకొని పక్కన కూర్చోబెట్టుకోవాలి!"

"కొత్త పనిమనిషిని పెట్టినప్పట్నుంచీ గమనిస్తున్నాను, మీ మొహంలో ఏదో వెలుగు కనిపిస్తోంది! ముగ్గురు పిల్లల తండ్రిగా, ఇద్దరు మనవలకి తాతగా బుద్ధుండాలి, సిగ్గుండాలి! మీ అమ్మని మీ తమ్ముణ్ణి తీసుకుపొమ్మని చెప్పండి. చుట్టపు చూపుగా వచ్చిన మా అమ్మని మా తమ్ముణ్ణి తీసుకుపొమ్మంటాను!"

"మేనమామలూ, బాబయ్యలూ లేకుండా పెళ్ళెలా చెయ్యడం? మనిషి సాయం ఉండాలిగా. ముసలాళ్ళిద్దరూ ఈ పెళ్ళి చూసి పోవాలనే కదా, గొంతుకలోకి వచ్చిన ప్రాణాల్ని మింగి మరీ బ్రతుకుతున్నారు?! వాళ్ళని బయటికి పంపే ప్రయత్నం చేస్తే, తెలుసుకోలేనంత మూర్ఖులు కాదు. నలుగురూ ఆడిపోసుకొంటారు. అందుకని సిద్ధాంతిగారు చెప్పినట్టు ఏదో కాస్త ఓపికపట్టి ఆ జపాలూ, ఉపవాసాలూ కానిచ్చేయ్! ఆపైన అంతా ఆ కళ్యాణ దేవతల కటాక్షం" అన్నాడు సుబ్బారావు.

"అంతేనంటారా? చెయ్యక తప్పదా?" అని మొదటిసారి దీనంగా అడిగింది.

"తప్పదు మరి, అమ్మాయి కళ్యాణి పెళ్ళి నిర్విఘ్నంగా జరగాలంటే ఈ మాత్రం కష్టపడక తప్పదు," అన్నాడు సుబ్బారావు దొంగ సానుభూతి ఎరువు తెచ్చుకొన్న స్వరంతో, భార్య మీద మొదటిసారిగా విజయం సాధించగలిగిన ఆనందాన్ని మనసులోకి అణచుకొంటూ.

సంబంధమంటూ కుదరాలేకాని, చేతిలో డబ్బుంటే అన్నీ కాంట్రాక్టు పద్ధతి మీద అమర్చి పెళ్ళి చెయ్యడం ఎంతసేపు అన్న ధీమాలో దంపతులిద్దరూ నడుం బిగించారు. సలహాలు లక్ష్మీనర్సమ్మవి, ఆచరణలు సుబ్బారావువి.

పెళ్ళి కబురు ఫోన్లలో అందుకొని, మరీ కావల్సిన వాళ్ళందరూ ఆగష్టు పదో తారీఖుకే

వచ్చేశారు. అదేరోజున మొదటి విఘ్నం కలిగింది. సుబ్బారావు పద్నాలుగు, పదిహేను తారీఖులకి బుక్ చేసుకొన్న ఆ వీధి చివరి తారకరామ కళ్యాణమందిరాన్ని, స్థలదురాక్రమణ జరిగిందంటూ నగరపాలక సంస్థ సగానికి సగం పడగొట్టేసింది. అంతకు ముందురోజే ఈ విషయమై ఉప్పందిన సుబ్బారావు కళ్యాణమందిరం యజమానితో సహా వెళ్ళి, తమ వార్డు కార్పొరేటర్ని పెళ్ళయేవరకూ కాస్త అడ్డుకోమని అర్థించాడు.

"నా ప్రహరీగోడే బలైపోతోంది, కేవలం ఆరంగుళాలు రోడ్డు మీదకు జరిగినందుకు! కొత్తగా వచ్చిన కమీషనర్ చండశాసనుడు, నేనేం చెయ్యగలను? అక్రమమైన అక్రమణల కూల్చివేత రేపు ఉదయం ఆరింటికి మా గోడ తోటే ప్రారంభమౌతుంది! అందరూ చూడ్డానికి రండి!" అని మొసలి కన్నీరు కార్చి, విధ్వంస కార్యక్రమానికి అహ్వానించాడు. వాస్తవానికి ఆ దురాక్రమణ నిర్మాణాల్ని నిర్మూలించే కాంట్రాక్టు ఆ కార్పొరేటర్ తన బావమరిది పేరిట టెండరు వేసి కొట్టేశాడు. ఆ కార్పొరేటరుకో బుల్‌డోజరుంది, ఓ ప్రొక్లైన్ ఉంది!

సుబ్బారావు కంగారుపడి, ఊళ్ళో ఉన్న అన్ని కళ్యాణమందిరాల చుట్టూ స్కూటర్ టైర్లరిగిపోయేటట్లు తిరిగాడు. ఏ మందిరానికి వెళ్ళినా బుక్ అయిపోయిందన్న సమాధానమే.

"మనకి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ఆగష్టు 15న పెళ్ళి ముహూర్తం రావటం ఇదే మొదటిసారి సార్! యవ్వనపు బాధల కోరల్లోంచి వివాహమనే అమోదముద్ర ద్వారా ఆగష్టు 15న తప్పించుకోవడం లేదా విముక్తి పొందడం చాలా సింబాలిక్‌గా ఉంది కదండీ! అసలు ఇకనుంచీ వివాహాలన్నీ ఆగష్టు 15న చేస్తే బావుంటుంది కదా?" అంటూ ఓ కళ్యాణమందిరం మేనేజరు క్లాసు పీకాడు.

"వివాహాలకి కాదు, విడాకులకి మంచి దినం ఆగష్టు 15" అని సుబ్బారావు ఆ మేనేజరుకి తిరుగు సమాధానం చెప్పి, జుట్టు పీక్కుంటూ ఇల్లు చేరాడు.

వాళ్ళ వీధిలోనే సుబ్బారావింటికి రెండిళ్ళకవతల ఓ ఖాళీ స్థలముంది. ఆ యజమానికీ, సుబ్బారావుకీ ఉపశాఖాపరమైన కొన్ని ఇబ్బందులున్నా, కాళ్ళు పట్టుకొన్నంతపని చేసి బ్రతిమాలడంతో ఆయన ఒప్పుకొన్నాడు. సుబ్బారావు పదిమంది మనుషుల్ని పెట్టి ఆ ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించి కాస్త చదును కూడా చేయించాడు. ఆగష్టు పదిహేనుకి జరిగే పతాకావిష్కరణలూ, ప్రత్యేక సమావేశాలూ కొల్లలుగా ఉండడం మూలాన, ముందు జాగ్రత్తగా పన్నెండో తారీఖుకే షామియానా వేయించేశాడు.

షామియానా వేసిన రోజునే పెళ్ళికూతురి నాయనమ్మకి కళ్ళు తిరిగాయి. అమ్మమ్మకి జలుబు చేసి ఆయాసం ముంచుకొచ్చింది. జపమో, ఉపవాసమో సరిగా చేయలేదని సుబ్బారావు భార్యని ఎవరూ చూడకుండా, ఎవరూ వినకుండా మందలించాడు. అటుపైన వెళ్ళి డాక్టరు గంగాభవానీని తీసుకొచ్చాడు.

"మా గురించి బెంగొద్దు, నిక్షేపంలా పెళ్ళి చూసి మరీ ఛస్తాం! ముందు మీ మూలాన పెళ్ళి ఆగిపోకూడదు! ఆ జాగ్రత్త తీసుకోండి!" అని ముసలివాళ్ళిద్దరూ కసిరారు. గంగాభవానీ ముసిముసి నవ్వులు నవ్వుతూ, ముసలివాళ్ళ మాటల వెనుక అర్థం గ్రహించి, ఓ ప్రిస్క్రిప్షన్

రాసిచ్చి, "మీ ఆడాళ్ళందరూ ఈ మాత్రలు వేసుకోండి," అని వెళ్ళిపోయింది.

ఆగష్టు పధ్నాలుగు మధ్యాహ్నం స్నేహితురాలు సునంద వచ్చిందని తెలిసి, కళ్యాణి పక్క వీధిలో ఉన్న సునంద ఇంటికి వెళ్ళింది.

"కాస్తా కూస్తా దూరమా? సెలవు పెట్టి కోల్‌కతా నుంచి వచ్చిన దాన్ని, నీ పెళ్ళికి రాకుండా ఇంట్లోనే కూర్చోడం నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించు కళ్యాణీ! 'కాస్త సేదతీర్చుకొని వెళ్దువుగాన్లే' అన్న, అమ్మ మాటల్ని కూడా ఖాతరు చెయ్యకుండా మీ ఇంట్లో వాల్దామన్న తొందరలో నేనుంటే, సరిగ్గా ఇదే సమయంలో అఘోరించింది! ఫోన్ చేసి చెబ్దామనుకొనేలోగానే నువ్వు వచ్చేశావు.

"చూడు కళ్యాణీ, నీకు నమ్మకం లేకపోవచ్చు. నువ్వు మంగళ స్నానాలు చెయ్యాలి. గౌరీ పూజలు చెయ్యాలి, శుభమా అంటూ పెళ్ళిపీటల మీద కూర్చోవాలి. అందుచేత అమంగళకరంగా నిన్ను అంటిపెట్టుకొని ఉండడం నాకు మనస్కరించటల్లేదు. ఎలాగూ పది రోజులు సెలవు పెట్టాను. స్నానం అవగానే వచ్చి మీ ఇంట్లోనే తిష్ఠవేసి, పొమ్మన్నా పోను! సరేనా?.... అం పొరపాటు! నీ మెళ్ళో మూడుముళ్ళూ పడ్డ తర్వాత నేను రాకపోయినా గుర్తుండదులే!" అంది సునంద నవ్వుతూ.

"సరేలే, నా లక్ యిలా ఉంది మరి! నేనిక్కడ కూర్చుని కబుర్లు చెబ్తూ కూర్చుంటే, మా అమ్మ చెల్లెల్లూ, బాబాయి భార్యా – అంటే ఇద్దరు పిన్నమ్మలూ నాకు పెట్టాల్సిన గోరింటాకు వాళ్ళు పెట్టుకో వల్సివస్తుంది! వస్తా" అని కళ్యాణి ఇల్లు చేరింది.

జూన్, జూలై, నెలల్లో రావాల్సిన మేఘాలు పనికట్టుకొని ఆలస్యంచేసి ఆగష్టు పధ్నాలుగు రాత్రిన వచ్చి, తొలకరి చినుకులుగా కాక కుంభవృష్టిగా కురిసాయి. ఆ రాత్రి మగపెళ్ళివారు భోజనాలు చేస్తున్న సమయంలో, షామియానా చిల్లుల్లోంచి కారుతోన్న నీటి ధారల్ని మనిషికో గ్లాసో, గిన్నో అదనంగా పెట్టి, పట్టి పారబోయసాగారు. తేగలిగినన్ని గొడుగులు తీసుకొచ్చి ముఖ్యమైన వాళ్ళకి గొడుగులు పట్టారు. షామియానా సప్లై మేనేజరు ఇకముందు గొడుగుల్ని కూడా తాము అద్దెకిచ్చే వస్తువుల లిస్ట్‌లో చేర్చాలనుకొన్నాడు.

పెళ్ళికొడుకు తండ్రి ఇవేం ఏర్పాట్లని విసుక్కున్నాడు. ఆ విసుగు కొంచెం శృతిమించి రాగాన పడ్డంతో, అందరికీ అమాయకంగా కనిపించే సుబ్బారావు వియ్యంకుణ్ణి పక్కగా తీసుకువెళ్ళి, "మీ అబ్బాయికి క్షవరం చేయించుకొని, స్నానం చెయ్యకుండా తినే అలవాటుండి తీరాలి! లేకపోతే ఈ వర్షం కురిసేది కాదు!" అన్నాడు గంభీరంగా.

వియ్యంకుడు ముందు కాస్త తెల్లబోయి, ఆ తర్వాత, "మీకెలా తెలుసు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"మా యిళ్లలో ఇప్పటికిది మూడో హైదరాబాద్ సంబంధం. ఆ పెళ్ళిళ్ళ సమయంలో కూడా ఇలాగే వర్షం కురిసింది! ఆరాతీస్తే, విపరీతమైన నీటి ఎద్దడి వల్ల హైదరాబాద్ వాళ్ళందరికీ ఇదే అలవాటని తెలిసింది! క్షవరం చేయించుకొన్న తర్వాత కుర్రాళ్ళు స్నానం చేయ్యకుండా ఏమైనా తిన్నా తాగినా వాళ్ళ పెళ్ళి సమయంలో వర్షం కురుస్తుందని, మా ఇళ్ళల్లో చాలా నమ్మకం!" అన్నాడు సుబ్బారావు.

వియ్యంకుడు ఆలోచించి సమాధానం ఇచ్చే అస్కారం లేకుండా సుబ్బారావే మళ్ళీ అన్నాడు.

"మీరేమి అనుకోకుండా ఉంటే మరికొన్ని విషయాలు చెబుతాను. మీకు జాతకాల మీద నమ్మకం లేదన్నారు. సరేనని మేమూ జాతకాల ప్రసక్తి తీసుకురాలేదు. కాని ముహూర్తం పెట్టే సిద్ధాంతిగారు వధూవరుల జననకాల వివరాలు కావాలన్నారు. మీరిచ్చిన వివరాలిచ్చాను. ఆయన రేపటి ముహూర్తం పెట్టి, ఇరువురి జాతకాలూ కుదిరినా, కుర్రవాడి జననకాల ప్రభావం వల్ల వివాహ సమయంలో చిన్నచిన్న అవరోధాలు కలుగుతాయన్నాడు. అయినా అవి సమాజ శ్రేయస్సుగా ఉంటాయన్నాడు. కుదుర్చుకొన్న కళ్యాణమందిరాన్ని కొట్టిపారేశారు. మా రోడ్డు విశాలమైంది. ప్రజలు సంతోషించారు. మా వార్డు కార్పొరేటరు చాలా సంపాదించాడు. అంతేకాక ఇప్పుడు వర్షం కురిసింది. వానల కోసం పడిగాపులుపడి ఎదురు చూస్తున్న రైతులు సంతోషిస్తారు. మా ఊళ్ళో చెరువులు నిండుతాయి. ఇవి వధూవరులకి అమూల్యమైన ఆశీర్వచనాలే బావగారూ!"

వియ్యంకుల వారి తల వేడి చల్లారింది. మరీ బిగుసుకుపోతే, నమ్మకం లేదంటూనే నక్షత్ర బంధాలు వేస్తున్న సుబ్బారావుకి – తమ వరపుత్రుడి జనన సమయం, తిథి, వార నక్షత్రాలే కాదు, సంవత్సరంతో సహా తప్పుడుదని తెలిసిపోతుందన్న భయంతో ఓ వెర్రినవ్వు నవ్వి, "అవునవును, మీరన్నది సబబుగానే ఉంది!" అంటూ వియ్యంకులవారక్కణ్ణుంచి జారుకొని, అరుస్తోన్న తన వాళ్ళని మందలించసాగాడు.

ఆ మర్నాడుదయం ఆహ్వానితులందరూ బురద నేల మీద వేసిన కుర్చీల్లో కూర్చుని, వివాహాన్ని తిలకించి, కూర్చున్నచోటునుంచే అక్షితలు విసిరి వధూవరుల్ని ఆశీర్వదించారు.

తను చేసిన మృత్యుంజయ జపం వల్ల అత్తగారూ, తల్లీ, వియ్యాపురాలూ గుటుక్కుమనకుండా కళ్యాణం నిర్విఘ్నంగా జరిగిపోయినా, లక్ష్మీనర్సమ్మ దిగులుగానే ఉంది. కారణమేమిటంటే – గంగాభవానీ ప్రిస్క్రిప్షన్ మీద కొన్న మందులు ఢిల్లీ చాందినీచౌక్ నకిలీ మందులు. ఫలితంగా లక్ష్మీనర్సమ్మ తోటికోడళ్ళే, మరిదినీ పీటల మీద కూర్చోబెట్టి కన్యాదానం చేయించవలసి వచ్చింది.

పెళ్ళికూతురికి తప్ప మరెవరికీ తెలిని ఓ రహస్యం ఉంది మరి. మందు వేసుకొన్న కళ్యాణికి అగష్టు ఇరవైకి రావల్సిన సమయం, పధ్నాలుగు రాత్రి వర్షంతోపాటు వచ్చేసింది. కళ్యాణి గప్‌చుప్‌గా గుసగుసల సహాయంతో, హాయిగా, నిశ్చింతగా పెళ్ళిపీటల మీద కూర్చుని పుస్తె ముడి వేయించేసుకొంది! పెళ్ళి వాయిదా పడ్తే తండ్రి గూబల్లోకి లాభాలొస్తాయన్న సంగతి కళ్యాణికి తెలియకనా?! సాధారణంగా గుసగుసలనేవి వివాహ సమయాల్లో చిచ్చుపెడ్తాయి. ఈ సందర్భంలో మట్టుకు గుసగుసలు కళ్యాణి కళ్యాణాన్ని నిర్విఘ్నంగా కొనసాగేటట్టు చేశాయి.

ఎంత కాదనుకున్నా సిద్ధాంతి సీతారామశాస్త్రి పెట్టిన ముహూర్తబలం గొప్పదే మరి!

కొసరు మాట: జాతకాలు చూసి ఎంతో శాస్త్రయుక్తంగా, మంత్రయుక్తంగానూ చేసిన వివాహాలు కూడా కొండెక్కుతున్నాయి. అదీకాక, వివాహానికి చట్ట సమ్మతమైన అంతిమ ఆమోదముద్ర, లేదా ధృవపత్రాన్ని రిజిస్ట్రారు వారు ఇవ్వవలసినప్పుడు ప్రస్తుతకాల పరిస్థితుల్లో ఇంతటి తంతూ, ఖర్చు అవసరమా?